
సాక్షి పల్నాడు

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



పీహెచ్‌సీలో టీబీ అధికారి తనిఖీలు

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ఎగువ నుంచి 2,50,865 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,79,998 క్యూసెక్కులు వదులుతున్నారు.



దుర్గమ్మ సేవలో మండలి చైర్మన్

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

మహాలక్ష్మి దేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీ దేవి శరన్నవరాత్ర్యుత్సవాలలో భాగంగా అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శుక్రవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కోదండ రామాలయంలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీ బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన చతుర్వేదుల శ్రీనివాసశాస్త్రి లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖకు అందజేశారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకారం అందిస్తా

జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావుపేట: జిల్లాలో నిర్మిస్తున్న వరికెపూడిశెల, పోలవరం–బనకచర్ల ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేందుకు తన వంతు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు భరోసా ఇచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అవసరమయ్యే అనుమతుల కోసం నిరీక్షించకుండా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టుకు సంబంధించి అలైన్‌మెంట్ ఫిక్సింగ్‌ను వారం రోజుల్లోగా పూర్తిచేసి ల్యాండ్ ప్లాన్ షెడ్యూళ్లను తయారు చేయాలన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరత్నం, పోలవరం–బనకచర్ల ప్రాజెక్ట్ ఈఈ శివరాంప్రసాద్, డీఇలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఏఇలు వెంకటేశ్వర్లు, శంకరాచారి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ

నరసరావుపేట: పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 12గంటలకు వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సు. దీర్‌భార్గవరెడ్డి పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఓటీపీ విధానంతో ఆస్తులకు రక్షణ



మంగళగిరి: ఓటీపీ విధానంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉంటుందని రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ బీ.ఆర్. అంబేడ్కర్ తెలిపారు. నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రవేశపెట్టిన ఓటీపీ విధానం ద్వారా నకిలీ రిజిస్ట్రేషన్‌కు అడ్డుకట్టపడటంతో పాటు ప్రజల ఆస్తులకు భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన మార్పులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, విజయవాడ డీఐటీ రవీంద్ర, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య పాల్గొన్నారు.



దాచేపల్లిలో వర్షపునీటిలో తేలాడుతున్న బెండ తోట



నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో చేరిన వర్షం నీటిలో పూజలు చేస్తున్న భక్తులు



గోలి గ్రామ శివార్లో ఉధృతంగా ప్రవహిస్తున్న గోలి వాగు

పొంగుతున్న వాగులు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- రాకపోకలకు అంతరాయం
- నీట మునిగిన పంట పొలాలు
- ఆందోళనలో రైతులు

వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వర్షాలు కురుస్తున్నాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల వాణిజ్య పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దాచేపల్లి: భారీ వర్షాలకు వాగులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. శుక్రవారం పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. నడికుడి–నారాయణపురం మార్గంలోని వాగు పొంగి ప్రవహించటంతో రాకపోకలు పూర్తిగా నిలిచాయి. మాదినపాడు రోడ్డులో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించింది. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలోకి నీరు చేరింది. భక్తులు నీటిలోనే పూజలు చేశారు. నాగులేరు ఉధృతంగా



పశర్లపాడు వద్ద చప్టా దాటేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు



నడికుడి–నారాయణపురం రోడ్డులో చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రవహించింది. పంట పొలాల్లోకి నీరు చేరింది. పత్తి, మిరప, బెండ, మొక్కజొన్న, కంది సాగు చేసిన పొలాల్లో నీరు నిలిచింది. పత్తి, మిరప మొక్కలు మెత్తబడ్డాయి. ముందస్తుగా వేసిన పత్తి పంటలోని చెట్లకు కాసిన పూత, పిందెలు రాలిపోయాయి. మిరప మొక్కలు ఉరకెత్తి చచ్చిపోయే పరిస్థితిలో ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెంటచింతల:మండలంలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. రాకపోకలకు అంతరాయ ఏర్పడింది. గోలి గ్రామ శివారులోని బ్రిడ్జిపై ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్త పాలువాయి–పాత పాలువాయి గ్రామాల మధ్య, పశర్లపాడు గ్రామ సమీపంలో పిల్లి వాగు ప్రమాదభరితంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంట పొలాల్లోకి నీరు చేరింది. పాత పాలువాయి గ్రామ ప్రధాన రహదారి కాలువను తలపిస్తుంది. రెంటచింతల, రెంటాల గ్రామాల వద్ద ఏడుమంగళం వాగు పొంగి ప్రవహిస్తుంది. మిట్టగుడిపాడు గ్రామ శివారులో నేంద్ర వాగు పొంగడంతో గోలి, మిట్టగుడిపాడు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి.

విరిగిపడిన కొండ చరియలు



సాగర్ నూతన బ్రిడ్జి సమీపంలో డ్రెయిన్‌లో పడిన బండరాళ్లు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి సమీపంలో రోడ్డు వెంట ఉన్న ఎత్తయిన కొండ చరియలు కూలడంతో బండ రాళ్లు రోడ్డుపై పడ్డాయి. పై నుంచి దొర్లుతూ వచ్చిన బండరాళ్లు రోడ్డు వెంట ఉన్న డ్రెయిన్‌లో పడటంతో అది పాక్షికంగా దెబ్బతిన్నది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 10గంటల వరకు కురిసిన భారీ వర్షానికి కొండ ప్రాంతం నానింది. మట్టి కరిగిపోయి బండరాళ్లు దొర్లుతూ రోడ్డుపైకి వచ్చాయి. ఆ సమయంలో రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. రోడ్డుపై పడిన బండరాళ్లను విజయపురిసౌత్ పోలీసులు తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగలేదు. ఇప్పటికైనా కొండపై లూజుగా ఉన్న బండరాళ్లను తొలగించాలని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఇరు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

- దసరా నుంచి దీపావళి వరకు 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' ప్రచారం
- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



జీఎస్టీ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నరసరావుపేట: జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో జీఎస్టీ అమలు, అవగాహనపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, ఔషధాలు, విద్య, స్టేషనరీ ఉత్పత్తులు, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, హోటల్ రంగాలలో పన్నులు తగ్గుతాయని అన్నారు. వ్యవసాయ ఉపకరణాల ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. దీని వలన కలిగే మేలుపై ప్రజలకు అవగాహన కల్పించడానికి సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా దసరా నుంచి దీపావళి వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. జేసీ నోడల్ అధికారిగా, వాణిజ్య పన్నుల శాఖ నోడల్ డిపార్టుమెంట్‌గా వ్యవహరిస్తుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేసి జీఎస్టీ సంస్కరణల వలన ఏఏ వస్తువులపై ధరలు తగ్గనున్నాయో వివరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో జీఎస్టీ సంస్కరణల కారణంగా ప్రజలకు కలిగే మేలును క్షేత్రస్థాయిలో వివరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ అతిథి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎస్టీ వేడుకల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్, వాణిజ్యపన్నులశాఖ అధికారులు రంగయ్య, రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పాల్గొన్నారు.

బాలకృష్ణను చీదరించుకుంటున్న ప్రజలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి



సత్తెనపల్లి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీలో అవమానపరిచే విధంగా మాట్లాడిన హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఆయన ఖండించారు. డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారని, బాలకృష్ణ మాత్రం వైఎస్ జగన్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. సైకో అంటూ పదేపదే అంటున్న బాలకృష్ణ సైకో ఇజం గురించి రాష్ట్రంలో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. తన ఇంట్లో జరిగిన కాల్పుల కేసు నుంచి బయటపడేందుకు బాలకృష్ణ తనకు మెంటల్ ఉందని సర్టిఫికెట్ తెచ్చుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను చులకనగా మాట్లాడటం బాలకృష్ణకు తగదన్నారు. బాలకృష్ణ పిచ్చివాగుడును చూసి ప్రజలే చీదరించుకుంటున్నారన్నారు. మరోసారి ప్రజానాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తూల నాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఎత్తిపోతలకు భారీ జలకళ



విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని ఎత్తిపోతల జలపాతానికి భారీగా వర్షం నీరు వచ్చి చేరటంతో శుక్రవారం జలకళతో కళకళలాడుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల మాచర్ల పట్టణంలోని చంద్రవంకవాగు, భైరవునిపాడు, తాళ్లపల్లి చెరువులు, ఎత్తిపోతల చుట్టూ ఉన్న అన్నీ చెరువులకు నీరు అధికంగా రావటంతో ఆ నీరంతా ఎత్తిపోతలకు తరలివస్తోంది. ఎత్తిపోతల జలపాతం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో 70 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న సుందరమైన నీటి దృశ్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండ పర్యాటకులు ఎత్తిపోతల అందాలను తిలకించేందుకు భారీగా తరలి వస్తున్నారు.

అసెంబ్లీ సాక్షిగా జగన్‌కు క్షమాపణ చెప్పాలి

- బాలకృష్ణ వ్యాఖ్యలను తక్షణమే అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలి
- విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలని, అతను చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడారు. జగన్‌ను సైకోగాడని, చిరంజీవిని ఎవడు..నాన్‌సెన్స్ అంటూ గురువారం అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బాలకృష్ణ మాటలు రాష్ట్ర ప్రజలు అసహ్యించుకునే రీతిలో ఉన్నాయని అన్నారు. అతని మాటలు, నిల్చున్న తీరు, బాడీ లాంగ్వేజ్ గమనిస్తే నిజంగా అసెంబ్లీకి మద్యం తాగి వచ్చాడేమో అనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి తక్షణమే స్పందించి బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు స్పీకర్ స్థానంలో ఉండి కూడా ఈ విషయాన్ని ఖండించకపోవటం దారుణమని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ తుపాకీ పేలిన ఘటనలో మేము కూడా రాజకీయాలు చేస్తే బాలకృష్ణ కుటుంబం ఎక్కడ ఉంటుందని అన్నారని, కనీసం ఈ విషయం కూడా అతనికి గుర్తులేకపోవటం బాధాకరమని అన్నారు. కరోనా సమయంలో సినిమా ఇండస్ట్రీ సమస్యలపై వచ్చిన వారందరినీ జగన్‌మోహన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారని, ఇండస్ట్రీ సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. సినిమా పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావాలని, విశాఖపట్నం లాంటి మహానగరాల్లో కూడా షూటింగ్‌లు నిర్వహించాలని, అవసరమైతే విశాఖపట్నంలో ఫిలిం సిటీ ఏర్పాటు చేసుకొని రాష్ట్రాన్ని కూడా అభివృద్ధి చేసుకుందామని చెప్పారన్నారు. దీనిపై సినీ హీరోలు చిరంజీవి, మహేష్‌బాబు, ప్రభాస్‌లు స్పందించి సంతోషం వ్యక్తం చేశారన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తప్పుడు మాటలు మాట్లాడారని, ఈయన మనిషి బీజేపీలో ఉన్నా మనస్సు మాత్రం ఎప్పుడూ టీడీపీలోనే ఉంటుందన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు చిరంజీవిని కూడా అవమానకరంగా మాట్లాడారని, దీనిపై జనసేన కార్యకర్తలు ఒక్కసారి ఆలోచన చేయాలని కోరారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై చిరంజీవి స్పందిస్తూ పలుమార్లు ఫోన్ చేసినా ఆయన అందుబాటులోకి రాలేదని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తన చొరవ వల్లే వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య సినిమా టికెట్ ధరల పెంపునకు జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించారని చిరంజీవి చెప్పిన విషయం మరవరాదన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కందుల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాసనసభ్యులు ఎవరికైనా మెంటల్ సర్టిఫికెట్ ఉందా అంటే, అది కేవలం బాలకృష్ణకేనన్నారు. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు నందమూరి కుటుంబం మీద ఉన్న గౌరవాన్ని కోల్పోయేలా చేస్తున్నాయని అన్నారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ మాట్లాడుతూ బాలకృష్ణ క్షమాపణలు చెప్పకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్త అతని ఓటమి కోసం పనిచేస్తారని అన్నారు. రొంపిచర్ల మండలం కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పానుగోటి వెంకటరావు, విద్యార్థి విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుతోళ్ల వేణుమాధవ్, నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు కోటపాటి మణీంద్రరెడ్డి, ప్రభుదాస్ నాయుడు, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు షేక్ కరీముల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చి శివకోటి పాల్గొన్నారు.



కరెన్సీ నోట్ల అలంకారంలో శృంగేరీ శ్రీ శారదాంబ



గణపవరం కోదండరామాలయంలో రూ.2 లక్షల నోట్లతో అలంకారం



పిడుగురాళ్ల గంగమ్మ తల్లి దేవస్థానంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



రేమిడిచర్ల గ్రామంలో రూ.2 లక్షలతో అమ్మవారి అలంకరణ



వినుకొండలో రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ

ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా చిలకలూరిపేట పట్టణంలోని శృంగేరీ శ్రీశారదాంబ దేవాలయంలో అమ్మవారిని శుక్రవారం ధనలక్ష్మి అలంకారం గావించారు. రూ. 21.5 లక్షలు విలువైన కరెన్సీ నోట్లతో విశేష అలంకారం చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వినుకొండ బోసుబొమ్మ సెంటర్‌లోని శ్రీవాసి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రూ.10 లక్షల కరెన్సీతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామంలో పార్వతి అమ్మవారిని కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు.

–చిలకలూరిపేట/వినుకొండ/బొల్లాపల్లి/పిడుగురాళ్ల

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా వీరారెడ్డి నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన వి.వీరారెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా (కేంద్ర కార్యాలయం) నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బాల్య వివాహంలో 14 మందిపై కేసు నమోదు

సత్తెనపల్లి: బాల్యవివాహంలో 14 మందిపై సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 3న పట్టణంలోని దోభీఘాట్‌లో బలుసుపాటి గోపి తన సొంత సోదరి కుమార్తె అయిన ఆరేటి అనుఖ్యలకు బాల్య వివాహం జరిగిందని నరసరావుపేట చైల్డ్ వెల్ఫేర్ కేర్ సంస్థకు ఫిర్యాదు వచ్చినట్లు ఈ నెల 23న చైల్డ్ వెల్ఫేర్ కేర్ సంస్థ ప్రతినిధి యర్రసాని ప్రశాంత్‌కుమార్ పట్టణంలోని 4వ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ గరికె కల్పనకు తెలియజేశారు. దీనిపై గరికె కల్పన విచారణ జరిపి వాస్తవం అని తేలడంతో ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహం చేసుకున్న ఇరువురితోపాటు ఇరువురు తల్లిదండ్రులు, బంధువులు, వివాహం జరిపిన పూజారి, కల్యాణ మండపం నిర్వాహకుడు, ఫొటోగ్రాఫర్ ఇలా మొత్తం 14 మందిపై బాల్య వివాహ చట్టం క్రింద పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేశారు.

పీహెచ్‌సీలో వ్యక్తి మృతిపై విచారణ



అచ్చంపేట: స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 21న సకాలంలో వైద్యసేవలు అందకపోవడంతో వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం అడిషనల్ డీఎంహెచ్ ఓ పద్మావతి విచారణ చేపట్టారు. మృతుడు షేక్ నాగుల్‌మీరా బంధువులను పిలిపించి విచారించారు. నాగుల్‌మీరా సకాలంలో వైద్యం అందకపోవడం వల్ల మృతి చెందాడా, మరే కారణాల వల్ల మృతి చెందాడా అనే విషయాలపై ఆరా తీశారు. తుది నివేదికను తన ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. అచ్చంపేటకు చెందిన సామాజిక కార్యకర్త షేక్ కమల్‌సైదా ఆధ్వర్యంలో మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని, పరిహారాన్ని అందించాలని కోరుతూ అడిషనల్ డీఎంహెచ్‌ఓ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. పీహెచ్‌సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, 108 అత్యవసరం వాహనం ఒక్క అచ్చంపేటకు మాత్రమే పరిమితమవుతుందని, 108 సేవలను మండలం మొత్తానికి విస్తరింపజేయాలని కోరారు.



అమ్మవారి దర్శనం అనంతరం కిందికి వస్తున్న భక్తులు, (ఇన్‌సెట్లో) మహాలక్ష్మి అలంకరణలో దుర్గమ్మ

ఇంద్రకీలాద్రికి భక్తులు వెల్లువలా తరలివస్తూనే ఉన్నారు. ఎండా వానను లెక్కచేయక, కాలినడకన కొండెక్కి అమ్మ దర్శనం చేసుకుని తరిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఆత్మస్థైర్యంతో అడుగులు వేస్తూ సునాయాసంగా నడిచేసి భక్తి ప్రపత్తులు చాటుకుంటున్నారు. శుక్రవారం అష్ట లక్ష్మీ సమష్టి రూపమైన శ్రీమహాలక్ష్మీదేవిగా కనక దుర్గమ్మ కొలువయ్యారు. భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు సిరుల తల్లిని కనులారా వీక్షించి, మా కల్పవల్లివి నీవే తల్లి అంటూ అంటూ ఐశ్వర్యసిద్ధి కోసం ప్రార్థించారు.

సిరివర్షిణీ..శిరసా నమామి

- మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు
- పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్లు, కాణిపాకం దేవస్థానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం పైగా శ్రీమహాలక్ష్మీదేవి అలంకారం కావడంతో తెల్లవారుజామున నుంచే భక్తుల రద్దీ కనిపించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశాల నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్‌లో రద్దీ కొనసాగుతూనే ఉంది. ఉదయం 6 గంటలకే సర్వ దర్శనం, రూ.100, రూ.300 టికెట్లు క్యూలైన్లలో దేవస్థాన ఘాట్‌రోడ్డులోని టోల్‌గేట్ వరకు చేరింది. మారిన వీఐపీ టైం స్లాట్ మేరకు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు వీఐపీలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక మిగిలిన సమయంలో అంతరాలయ గేట్లకు ఆలయ అధికారులు తాళాలు వేశారు. వీఐపీ టైం స్లాట్ మినహా మిగిలిన సమయంలో వచ్చిన వీఐపీలకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ప్రాంగణానికి వీఐపీలు రాకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు కట్టుదిట్టం చేశారు. ప్రత్యేక కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీయాగంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు హాజరయ్యారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టినట్లు భక్తులు పేర్కొంటున్నారు. రూ.100, రూ.300 టికెట్ క్యూలైన్‌లో సైతం గంటన్నరకు పైగా సమ యం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

దుర్గమ్మకు కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ఈవో పెంచల కిషోర్, స్థానాచార్యులు ఫణీంద్రస్వామిలతో పాటు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ పట్టువస్త్రాలతో దుర్గ గుడికి విచ్చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.



కుంకుమపూజలో పాల్గొన్న దంపతులు

90 వేల మంది దర్శనం..

మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు సుమారు 90 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. 5వ రోజు దేవస్థానానికి రూ.28.21లక్షల ఆదాయం సమకూరిందని చెప్పారు. లడ్డూల ప్రసాదం విక్రయం ద్వారా రూ. 2.86 లక్షలు, ఆరు లడ్డూ బాక్స్ ప్యాక్ విక్రయం ద్వారా రూ. 23.58లక్షలు, ఆర్జిత సేవా, తలనీలాల టికెట్ల విక్రయంద్వారా రూ.1.75 లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. అన్న ప్రసాదాన్ని 23,656 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు.

ఉత్సాహం.. ఆనందం..

సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో ఆది దంపతులైన శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు నిర్వహించిన నగరోత్సవం కనుల పండువగా సాగింది. మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద యాగశాలలో ఆదిదంపతులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. మహామండపం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాట నృత్యాలు, డప్పు కళాకారులు విన్యాసాలతో నగరోత్సవం ముందుకు సాగింది. అమ్మవారిని దర్శించుకుని కొండ దిగువకు చేరుకున్న భక్తులు ఆదిదంపతుల నగరోత్సవంలో పాల్గొని తరించారు.



నేటి అలంకారం
శ్రీలలితా త్రిపుర సుందరీదేవి

దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో ఆరో రోజున దుర్గమ్మ శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమివ్వనున్నారు. శ్రీలక్ష్మీదేవి, శ్రీ సరస్వతీదేవి ఇరు వైపులా వింజామరలతో సేవిస్తూ ఉండగా.. చిరు మందహాసంతో వాత్సల్యరూపిణిగా చెరుకుగడను చేతపట్టుకుని దర్శనమిస్తారు.

ఇంద్రకీలాద్రిపై నేడు

- తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం(యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- సాయంత్రం 5 గంటలకు శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవ సేవ
- సాయంత్రం 5 గంటలకు మహా మండపం ఆరో అంతస్తులో అర్చక సత్కార సభ
- సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

మహాలక్ష్మీ సేవలో గవర్నర్లు..



త్రిపుర గవర్నర్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి విడివిడిగా దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్‌లు సాదరంగా స్వాగతం పలకగా, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించారు. వేద ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలు, చిత్రపటాన్ని గవర్నర్‌కు అందజేశారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి దంపతులను ఈవో శీనానాయక్ స్వాగతం పలుకగా.. అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు.

జీఎస్‌టీ రెండు స్లాబులతో ప్రజలకు మేలు

జిల్లా జీఎస్‌టీ అధికారి జాన్ స్టీవెన్‌సన్



నరసరావుపేట: దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన సంస్కరణలలో గతంలో ఉన్న స్లాబులన్నింటినీ మార్చి ప్రస్తుతం 5, 12 శాతం స్లాబులను అమల్లోకి తీసుకొచ్చాయని ఉమ్మడి గుంటూరు జిల్లా వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్-2 జాన్ స్టీవెన్‌సన్ పేర్కొన్నారు. శుక్రవారం వాణిజ్యపన్నులశాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలియచేశారు. గతంలో ఉన్న ఐదుశాతం, 12, 18శాతం పన్నులు ఉన్న వస్తువులు జీరో స్థాయికి తీసుకొచ్చారన్నారు. 12, 18శాతంలో ఉన్న వస్తువులను చాలావరకు ఐదు శాతానికి తీసుకురావటం జరిగిందన్నారు. దీని వలన ప్రజలకు చాలా డబ్బు ఆదా అవుతుందని, మన రాష్ట్ర పరిస్థితి గమనిస్తే ఏడాదికి రూ.8వేల కోట్లు ప్రజలకు ఆదా అవుతుందన్నారు. దీనిని ఇంటింటికి తీసుకెళ్లేందుకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అనే పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈనెల 25 నుంచి అక్టోబరు 19వరకు అంటే దసరా నుంచి దీపావళి వరకు ప్రతిరోజూ ఏదో ఒక కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. నిత్యావసరాలు, రాగి, స్టీలు, ఇత్తడి పాత్రలు, విద్యార్థులు వాడే నోట్‌బుక్‌లు, పెన్నులు, కార్లు, కళ్లద్దాలు, మోటార్‌బైక్‌లు తదితర వస్తువులు రేట్లు తగ్గాయన్నారు. ప్రజలకు మిగిలే రూ.8వేల కోట్లతో మళ్లీ వారు కొనుగోలు చేయటం వలన ప్రభుత్వానికి ఇంకా పన్నులు లభించే అవకాశం ఉందన్నారు. దీని అమలు కోసం స్థానిక కార్యాలయంలో ఒక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. షాపులు, పెద్దమాల్స్‌లో బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించామన్నారు. బోర్డులు ఏర్పాటుచేయని వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యాపారస్తులకు తమ సహకారం ఉంటుందన్నారు. వ్యాపారులు కూడా తమకు సహకరించాలని కోరారు. నరసరావుపేట అసిస్టెంట్ కమిషనర్లు రంగయ్య, రామారావు పాల్గొన్నారు.

ఆట్యా-పాట్యా ఓవరాల్ చాంపియన్ పల్నాడు



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పల్నాడు బాలికల జట్టు



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పల్నాడు జిల్లా బాలుర జట్టు

నకరికల్లు: ఆట్యా-పాట్యా రాష్ట్ర స్థాయి పోటీల్లో పల్నాడు జిల్లా బాలబాలికల జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచాయి. నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యాన రెండురోజుల పాటు నిర్వహించిన 12వ రాష్ట్రస్థాయి సీనియర్ ఆట్యా-పాట్యా చాంపియన్‌షిప్-2025 పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. వర్షంలోనూ ఉత్కంఠభరితంగా మ్యాచ్‌లు సాగాయి. ఎస్ఐ కె.సతీష్ చేతుల మీదుగా విజేతలకు పతకాలు, మెడల్స్, సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు.

విజేతల వివరాలు..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 540 మంది క్రీడాకారులు తలపడ్డ ఆట్యా-పాట్యా పోటీలో పల్నాడు జిల్లా బాలబాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో కర్నూలు, తృతీయస్థానంలో గుంటూరు, నాలుగో స్థానంలో నెల్లూరు నిలిచాయి. బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో వెస్ట్ గోదావరి, తృతీయస్థానంలో నెల్లూరు, నాలుగో స్థానంలో గుంటూరు జిల్లా జట్లు నిలిచాయి. అసోసియేషన్, గ్రామస్తులు, క్రీడాభిమానుల సహకారంతో పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.ఝాన్సీరాణిని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 డి.బ్రహ్మేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్‌లు చింతా పుల్లయ్య, నిడికొండ జానకిరామయ్య, చినబాబు, పెదబాబు, ప్రధానోపాధ్యాయులు కె.రంగాదేవి, కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్టోబర్ 27న జిల్లా పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం అక్టోబర్ 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సంఘంలో సభ్యత్వం గల ప్రతి ఒక్క పెన్షనర్ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమస్యలపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

జిల్లాలో పీఎం కుసుంకు 94 ఎకరాల కేటాయింపు

రిలయన్స్‌కు వేరే స్థలం చూడాలని నిర్ణయం

నరసరావుపేట: జిల్లాలో రిలయన్స్ కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు వెల్దుర్తి మండలం రచ్చమల్లపాడు గ్రామం పరిధిలో సర్వే చేసిన వెయ్యి ఎకరాల భూమి ఫారెస్టు డిపార్టుమెంట్‌కు చెందినందున వేరొక స్థలాన్ని చూసి ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. శుక్రవారం గురజాల డివిజన్‌లో పీఎం కుసుంతోపాటు రిలయన్స్ కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కోసం భూమి సేకరించటంపై కలెక్టర్ కృతికా శుక్లా తన కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా ఏడి సర్వేయర్ భానుకీర్తి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, జిల్లా అటవీ శాఖ అధికారి సుప్రజలతో సమీక్షించారు. గురజాల డివిజన్ పరిధిలోని వెల్దుర్తి మండలంలో ప్రభుత్వ భూమి 75 ఎకరాలు, దుర్గి మండలంలో 11 ఎకరాలు, మాచర్ల మండలంలో ఎనిమిది ఎకరాలు కలిపి మొత్తం 94 ఎకరాల ప్రభుత్వ భూమిని పీఎం కుసుం (సోలార్)ప్రాజెక్ట్ కింద నెడ్‌కాప్ సంస్థకు కేటాయించేందుకు ప్రతిపాదించాలని నిర్ణయించారు. రిలయన్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, వెల్దుర్తి తహసీల్దార్ కె.రాజశేఖర్‌నాయక్, మాచర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హాజరయ్యారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, దుర్గా పద్మజ

రోడ్డు ప్రమాద తీవ్రత మహిళపైనే పడుతుంది

పల్నాడు జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యులు, రోడ్డు సేఫ్టీ ఎన్జీవో ప్రెసిడెంట్ ఆర్.కనకదుర్గ పద్మజ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను శుక్రవారం కలిసి ఆమె చేతులు మీదుగా రోడ్డు భద్రత సూచనలతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అత్యంత విషాదకరమైన సంఘటనలని, రోడ్డు ప్రమాదం తీవ్రత ఆ కుటుంబం మహిళపైనే పడుతుందని అన్నారు. పల్నాడు జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లా చేయడానికి అన్ని శాఖలతో సమీక్ష నిర్వహిస్తామని, దీనికి ఎన్జీఓల సూచనలు, సలహాలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానంతో అధిక దిగుబడులు

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను అజయ్ ఇంటెలికాప్ మహారాష్ట్ర ఎన్జీవో బృందం సభ్యులు పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగవుతున్న క్షేత్రాలకు డీపీఎం అమలకుమారి వారిని తీసుకువెళ్లి వివరించారు. రైతులు పండిస్తున్న పలు పంటల సాగు వివరాలు, కషాయాల వినియోగం, బీజామృతం వంటి ప్రకృతి పద్ధతులను వివరించారు. బయో ఇన్పుట్ రిసోర్స్ సెంటర్లో ఘన, ద్రవ జీవామృతాల తయారీని పరిశీలించారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో మహిళా రైతు మహాలక్ష్మి ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న వరి పొలాన్ని పరిశీలించి, సాధారణ సాగు పొలంలో కంటే ఎక్కువ పిలకలు రావడాన్ని గమనించారు.

మహిళా సంఘాలతో సమావేశమై రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి రావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రైతు సేవ కేంద్రాల్లో పీఎండీఎస్ కిట్లు, పీజీఎస్ సర్టిఫికేషన్, మహిళా సంఘాల పాత్ర, ప్రాముఖ్యతను తెలియజేశారు. చంద్రాజుపాలెంలో మహిళా రైతు రొయ్యల మంగమ్మ పొలంలో ఏటీఎం మోడల్ లను సందర్శించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడు హత్య

నరసరావుపేటరూరల్: గుర్తు తెలియని యువకుడు హత్యకు గురైన ఘటన మండల పరిధిలోని ఇస్సపాలెం సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... ఇస్సపాలెం పరిధిలోని జొన్నలగడ్డ బైపాస్ రోడ్డు పక్కన ఉన్న హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలోని వంకాయలకుంటలో మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి సీఐ హైమారావు, రూరల్ ఎస్ఐ కిషోర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కుంట నుంచి వెలికి తీయించారు. మృతదేహం కుడి, ఎడమ ఛాతీపై యేసయ్య, యేసు మరియమ్మ, ఐ లవ్ దేవి అని పచ్చ బొట్లు ఉన్నాయి. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి తల వెనుక భాగంలో రెండు చోట్ల బలమైన గాయాలు ఉండటంతో హత్య చేసి మృతదేహాన్ని కుంటలో వేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిత్యం వాహనాల రద్దీ ఉండే బైపాస్ రోడ్డుకు సమీపంలో వంకాయలకుంట ఉంది. గ్యాస్ గోడౌన్ సిబ్బందితోపాటు సమీపంలోని నివాస గృహాల వారు ఈ ప్రాంతంలో సంచరిస్తుంటారు. చేపలు పట్టేందుకు, మద్యం తాగేందుకు కుంట వైపు యువకులు వస్తుంటారు. పట్టణానికి సమీపంలో యువకుడు హత్యకు గురికావడం సంచలనంగా మారింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ హైమారావు తెలిపారు.



ఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

